
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
బుధవారం 21 ఆగస్టు 2024



డెంగ్యూతో బాలిక మృతి

అగనంపూడి, ఆగస్టు 20: డెంగ్యూ బారినపడి ఎనిమిదేళ్ల బాలిక మంగళవారం మృతిచెందింది. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 85వ వార్డు పరిధి ఈ-బోనంగికి చెందిన ములకలపల్లి నూక రామారావు కుమార్తె శ్రీసాహితి (8)కి వారం క్రితం జ్వరం రావడంతో స్థానికంగా గల వైద్యులకు చూపించారు. అయినప్పటికీ తగ్గకపోవడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యుల సలహా మేరకు కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ డెంగ్యూగా నిర్ధారణ కావడం, అప్పటికే శ్రీసాహితి ఆరోగ్యం బాగా క్షీణించడంతో మంగళవారం మృతిచెందింది.

ఏటీఎంలకు భద్రత నిల్

నిర్వహణ భారం పేరుతో సెక్యూరిటీ గార్డులను తొలగించిన బ్యాంకులు

- సీసీ కెమెరాల నిర్వహణపైనా నిర్లక్ష్యం
- నగదు నింపే ఏజెన్సీలపైనా పర్యవేక్షణ కరవు
- దొంగలకు వరంగా మారిన బ్యాంకర్ల తీరు
- ఏటీఎంలలో భద్రత పెంపుపై దృష్టిసారించిన సీపీ



కప్పరాడలో సెక్యూరిటీ గార్డులేని ఏటీఎం కేంద్రాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో కొన్నిచోట్ల మినహాయిస్తే ఏటీఎంలకు ఎక్కడా సరైన భద్రత ఉండడం లేదు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులు లేకపోవడం, సీసీ కెమెరాలు పనిచేయకపోవడం దొంగలకు వరంగా మారింది. నగరంలో వరుస చోరీల నేపథ్యంలో ఏటీఎంల భద్రతపై చర్చ మొదలైంది.

నగర పరిధిలో 500కిపైగా ఏటీఎంలు ఉన్నాయి. ఖాతాదారుల సంఖ్యను పెంచుకోవడం కోసం ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులు ఎక్కడికక్కడ ఏటీఎం కేంద్రాలను ఏర్పాటుచేశాయి. మొదట్లో ఏటీఎంల వద్ద ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు, సీసీ కెమెరాలను ఏర్పాటుచేశాయి. దాంతోపాటు ఏటీఎం కార్డుని స్వైప్ చేస్తేగానీ డోర్ తెరుచుకోనివిధంగా కొన్నిచోట్ల భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకున్నారు. దీనివల్ల ఏటీఎం లోపల ఎవరైనా అమాయకులను మోసం చేసి డబ్బులు కొల్లగొట్టినా, దోపిడీ చేసినా నిందితులను సులభంగా గుర్తించే అవకాశం ఉండేది. కాలక్రమేణా ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు పెరగడంతో ఏటీఎంలకు డిమాండ్ తగ్గింది. అదే సమయంలో బ్యాంకులు కూడా నిర్వహణ భారాన్ని తగ్గించుకునే చర్యలపై దృష్టిసారించాయి. ముఖ్యమైన ఏటీఎంలు, బ్యాంకు ఆవరణలో ఏర్పాటుచేసిన ఈ-కార్నర్ వంటి చోట్ల మినహాయిస్తే మిగిలిన కేంద్రాల వద్ద సెక్యూరిటీ గార్డులను తొలగించాయి. అదేవిధంగా ఏటీఎం కేంద్రాల్లో సీసీ కెమెరాలు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో వాటిని పట్టించుకోకుండా వదిలేశాయి. ఏటీఎంలలో నగదు నింపే బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడంతో సీసీ కెమెరాల ఫుటేజీని పర్యవేక్షించే కంట్రోల్ రూమ్‌లపైనా నిర్లక్ష్యం వహించాయి. దీంతో ఏటీఎంల భద్రత గాల్లో దీపం మాదిరిగా మారిపోయింది. రాత్రి సమయంలో సెక్యూరిటీ గార్డులు లేకపోవడంతో ఏటీఎం కేంద్రాలు నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయాయనే ఆరోపణలు ఉన్నాయి. ఏటీఎంలను తెరవడం చాలా క్లిష్టమైన పని. ఏదో పదునైన ఆయుధం ఉపయోగించి తెరిచినప్పటికీ, అందులో నగదు ఉంచిన కంటైనర్‌ను తెరవడం అసాధ్యం. దీంతో దొంగలు తెలివిగా గ్యాస్ కట్టర్‌ను ఉపయోగించి నగదు ఉండే కంటెయినర్‌ను కూడా క్షణాల్లో తెరిచేస్తున్నారు. ఏటీఎంలలోని సీసీ కెమెరాలను బ్యాంక్‌ల కంట్రోల్‌రూమ్‌కు గతంలో మాదిరిగా అనుసంధానించకపోవడం, అనుసంధానం ... మిగతా 6వ పేజీలో

హరియాణా ముఠా పనే...

ఏటీఎంలలో దోపిడీ కేసు దర్యాప్తులో పురోగతి

- ఐదుగురు పాల్గొన్నట్టు గుర్తింపు
- అందులో ఒకరు పాత నేరస్థుడు
- నిందితుల కోసం వెళ్లిన ప్రత్యేక బృందాలు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏటీఎం కేంద్రాల్లో చోరీలకు పాల్పడుతున్నది హరియాణాకు చెందిన ముఠాగా పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. అనకాపల్లి జిల్లా మునగపాకలోని ఎస్‌బీఐ ఏటీఎంను ఈనెల 16న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి రూ.14.4 లక్షలను ఎత్తుకుపోయారు. ఆ మరుసటిరోజే పెందుర్తి, తగరపువలసలో అదేతరహాలో రూ.33.4 లక్షలు అపహరించుకుపోయిన విషయం తెలిసిందే. చోరీ జరిగిన ... మిగతా 6వ పేజీలో

పడకేసిన పర్యాటకం



గత ఐదేళ్లుగా గాలికి వదిలేసిన వైసీపీ సర్కారు

- టీడీపీ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులపై నిర్లక్ష్యం
- పెట్టుబడిదారుల సదస్సులో పదికిపైగా ఒప్పందాలు
- ఒక్కటి కూడా కార్యరూపం దాల్చని వైనం
- అరకులో నిరుపయోగంగా డ్రైవ్ ఇన్ రెస్టారెంట్, కళావేదిక
- అసంపూర్తిగా ఈట్ స్ట్రీట్, ట్రైబల్ హట్స్ ప్రాజెక్టులు
- విశాఖ, అరకు, భీమిలి ఉత్సవ్‌లకు కూడా చెల్లు చీటీ
- నేడు పర్యాటక శాఖా మంత్రి సమీక్ష

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పర్యాటకం వెలవెలబోతోంది. వైసీపీ ప్రభుత్వం ఒక్క రుషికొండ భవనంపైనే దృష్టి పెట్టి మిగిలిన వాటిని గాలికి వదిలేసింది. టీడీపీ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కూడా ఆసక్తి చూపలేదు. కొన్నింటికి ప్రారంభోత్సవాలు చేసి వదిలేసింది.

రాష్ట్రంలో టెంపుల్ టూరిజం కేంద్రమైన తిరుపతి తరువాత పర్యాటకులు అత్యధికంగా వచ్చేది విశాఖపట్నం జిల్లాకే. ఇక్కడ అరకులోయ అందాలు, విశాఖ, భీమిలి బీచ్ సోయగాలు, బొర్రాగుహలు, లంబసింగి ఆకట్టుకుంటాయి. వైసీపీ హయాంలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో విశాఖ కేంద్రంగా పర్యాటక ఒప్పందాలు పదికి పైగా చేసుకున్నారు. అందులో ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదు. రూ.200 కోట్లతో దేవ్ భూమి సంస్థ రోప్‌వే ప్రాజెక్టులు చేపడతామని ఎంఓయూ చేసుకుంది. ఒక్కచోట కూడా రాలేదు. డ్రీమ్ వ్యాలీ సంస్థ వేయి కోట్ల రూపాయలతో గోల్ఫ్ గేటెడ్ కమ్యూనిటీ, 5 స్టార్ రిసార్ట్ కడతామని ఒప్పందం చేసింది. కనీసం డీపీఆర్ కూడా కాలేదు. మరో సంస్థ రూ.150 కోట్లతో ఎకో టూరిజం ప్రాజెక్టులు చేపడతామని సంతకాలు చేసింది. అడుగు ముందుకు పడలేదు. ఇంకా రూ.250 కోట్లతో జల విహారాలు, రూ.120 కోట్లతో స్కై టవర్, రూ.100 కోట్లతో టన్నెల్ అక్వేరియం నిర్మాణానికి ఒప్పందాలు జరిగాయి. వీటిలో ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదు. పర్యాటక శాఖ ఒప్పందాలు చేసుకోవడానికే పరిమితమై వాటిని పట్టించుకోకుండా వదిలేసింది.

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వం వాటికి నిధులు మంజూరు చేయకపోవడంతో మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న అరకులోయ లోని హరితావేలి రిసార్టులో తెలుగుదేశం ప్రభుత్వం సుమారు రూ.రెండున్నర కోట్లతో డ్రైవ్ ఇన్ రెస్టారెంట్, ధింసా కళావేదికలను నిర్మించింది. వీటిని అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. కానీ నేటికీ డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ మూతబడే ఉంది. అలాగే కళావేదిక కూడా నిర్వహణ లేక తుప్పలతో నిండిపోయి ఉంది.

ఇదిలావుండగా అరకులోయ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొత్తవలస హెచ్‌ఎన్‌టీసీ ఫామ్‌కు చెందిన 18 ఎకరాల్లో రూ.7 కోట్లతో ఈట్‌స్ట్రీట్, ట్రైబల్‌హట్ ప్రాజెక్టులను గత తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. పనుల్పు జోరుగా జరుగుతున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం కొలువు దీరడంతో ఈ ప్రాజెక్టు మూలకు చేరింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 20 శాతంలోపు జరిగిన పనులను నిలిపివేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. దాంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఈట్ స్ట్రీట్, ట్రైబల్ హట్‌లు తుప్పలు, మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా చింతపల్లి మండలం లంబసింగిలో 12 రిసార్ట్స్ నిర్మాణానికి టీడీపీ హయాంలో పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో ముక్కుతూ మూలుగుతూ అందులో ఆరు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. మిగిలిన ఆరింటికి కనీసం పునాదులు కూడా వేయలేదు. మేఘాలతో అలరించే చెరువులవేనం గ్రామానికి రహదారిని ప్రతిపాదించారు. మట్టి రోడ్డుతో సరిపెట్టేశారు. ఇక అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో గల కొండకర్ల ఆవకు సందర్శకుల సంఖ్య పెరుగుతున్నా మౌలిక వసతులు లేవు.

ఉత్సవ్‌లకు తిలోదకాలు

పర్యాటకులను ఆకర్షించేందుకు అడపాదడపా ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూ ఉండాలి. తెలుగుదేశం హయాంలో ప్రతి ఏటా డిసెంబరులో విశాఖ ఉత్సవ్, భీమిలి ఉత్సవ్, అరకు ఉత్సవ్‌లు నిర్వహించేవారు. వైసీపీ హయాంలో ఒకే ఒక ఏడాది ... మిగతా 6వ పేజీలో

బ్లాక్‌లో ఇసుక

అగనంపూడి డిపోలో టన్ను రూ.1,076కు కొనుగోలు

- బయట రూ.1800-2,000కు అమ్మకం
- దళారుల దందా
- అగనంపూడి నుంచి అనకాపల్లి జిల్లాకు తరలింపు
- భీమిలి డిపోలో నో స్టాక్



అగనంపూడి డిపోలో బారులు తీరిన వాహనాలు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిపోల నుంచి కొందరు ఇసుకను కొనుగోలు చేసి బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. ప్రధానంగా అగనంపూడి డిపో పరిధిలో ఈ దందా ఎక్కువగా నడుస్తోంది. డిపోలో టన్ను రూ.1,067కు కొనుగోలు చేసి బయట రూ.1,800-రూ.2,000కు అమ్ముకుంటున్నారు. నగరంలో కూడా టన్ను రూ.రెండు వేలకు అటుఇటుగా అమ్మకాలు సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకువచ్చింది. అయితే విశాఖలో రీచ్‌లు లేకపోవడంతో ఇటు రాజమండ్రి, అటు శ్రీకాకుళం నుంచి తీసుకువచ్చిన ఇసుకకు రవాణా ఖర్చులు, సీనరేజ్ చార్జీలు మాత్రమే వసూలు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు రేటు ఖరారు చేశారు. భీమిలి, అగనంపూడి డిపోల్లో గతంలో తీసుకువచ్చిన ఇసుక ఉంది. రెండింటి మధ్య రేటు తేడాను అధికారులు సవరించి టన్ను రూ.1076గా ఖరారు చేశారు. వారం క్రితం భీమిలి డిపోలో ఇసుక పూర్తిగా అయిపోయింది. మరో పది వేల టన్నుల వరకు ఉన్నా సమీపంలో గల మునిసిపాలిటీ డంపింగ్ యార్డు నుంచి మురుగునీరు వచ్చి కలవడంతో ఆ ఇసుకను ఎవరూ కొనుగోలు చేయడం లేదు. ఈ నేపథ్యంలో అగనంపూడి డిపోలో ఉన్న ఇసుకకు పోటీ పెరిగింది. ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల యజమానులు, ఆపరేటర్లు డిపోలో టన్ను రూ.1,076కు కొనుగోలు చేసి సమీపంలో చిన్నచిన్న యార్డుల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడ నుంచి నిర్మాణదారులకు దూరాన్ని బట్టి టన్ను రూ.1,800 నుంచి రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. నిబంధనల మేరకు అగనంపూడి డిపోలో ఇసుక కొనుగోలు చేయాలంటే విశాఖ జిల్లాలో నివాసం ఉంటున్నట్టు ఆధార్‌కార్డు చూపిస్తే సరిపోతుంది. లారీ ఆపరేటర్లు విశాఖ జిల్లాలో ఆధార్ నంబర్లు చూపించి ఇసుక కొనుగోలు చేసి పక్కనే ఉన్న లంకెలపాలెం, పరవాడ, అచ్యుతాపురం, అనకాపల్లి ప్రాంతాలకు తరలిస్తున్నారు. అగనంపూడి డిపో వద్ద లారీలు/ట్రాక్టర్లు/టిప్పర్లు బారులు తీరుతున్నాయి. ఉదయం క్యూలో పెట్టిన బండి ఇసుక లోడ్‌తో బయటకు రావాలంటే ఒకరోజు సమయం పడుతుంది. అసలైన వినియోగదారుల కంటే రవాణా ఆపరేటర్లే అక్కడ అధికంగా ఇసుక ... మిగతా 6వ పేజీలో

25న స్టాండింగ్ కమిటీ సమావేశం?

మేయర్, కమిషనర్ నిర్ణయం

- 300కి పైగా అంశాలతో ఎజెండా
- వచ్చే నెల మొదటి వారంలో కౌన్సిల్ సమావేశం నిర్వహణకు ప్రయత్నాలు
- స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ సమావేశాలు సకాలంలో జరగకుంటే నగరాభివృద్ధిపై ప్రభావం

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహణకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ పి.సంపత్‌కుమార్ చర్యలు ప్రారంభించారు. స్టాండింగ్ కమిటీ రెండు వారాలకొకసారి సమావేశం కావాల్సి ఉంది. అయితే గత ఐదు నెలలుగా ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. 2024 సాధారణ ఎన్నికలకు మార్చి 16న నోటిఫికేషన్ విడుదల కావడంతో కోడ్ అమలులోకి వచ్చింది. దాంతో కమిటీ సమావేశం జరగలేదు. ఎన్నికలు ముగిసిన తర్వాత కూటమి అధికారంలోకి రావడం, జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న సాయికాంత్‌వర్మకు బదిలీ కావడం వంటి కారణాలతో స్టాండింగ్ కమిటీ నిర్వహణకు వీలుపడలేదు. ఈలోగా పాత కమిటీ పదవీకాలం ముగిసింది. స్టాండింగ్ కమిటీ సమావేశం కాకపోవడంతో జీవీఎంసీలో అభివృద్ధి పనులపై ప్రభావం పడుతోంది. కేవలం రూ.20 లక్షల కంటే తక్కువ విలువైన పనులపై మాత్రమే నిర్ణయం తీసుకునే అధికారం కమిషనర్‌కు ఉండడంతో ఆ మేరకు మాత్రమే అనుమతిస్తూ వస్తున్నారు. నగరంలో జరిగే పనుల్లో అత్యధికం రూ.20 లక్షల కంటే ఎక్కువ విలువైనవి కావడంతో అవన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో ... మిగతా 6వ పేజీలో

భూముల విలువ పెంపు

45 రోజుల అధ్యయనం తరువాత నిర్ణయం

- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల సిబ్బందితో మండల స్థాయిలో కమిటీలు
- జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లు, మండల తహసీల్దార్లు, వీఎంఆర్‌డీఏ అధికారుల సమావేశం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలు పెంచేందుకు నిర్ణయించింది. ఏటా ఆగస్టులో రిజిస్ట్రేషన్ల శాఖ భూ లావాదేవీలు ఎక్కువ జరిగే చోట విలువలు పెంచడం ఆనవాయితీగా వస్తోంది. గత ప్రభుత్వం జాతీయ రహదారులు, ప్రధాన మార్గాలు పక్కనున్న గ్రామాలతో పాటు అధిక నిర్మాణాలు, ఎక్కువ లేఅవుట్లు వస్తున్న ప్రాంతాల్లో మార్కెట్ విలువలను 20 శాతం నుంచి 24 శాతం వరకు పెంచింది.

విశాఖపట్నం జిల్లా వరకు చూసుకుంటే ఇక్కడ భూముల ధరల భారీగా పెరిగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం రుషికొండ ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేస్తున్నట్టు విస్తృతంగా ప్రచారం చేయడం, భీమిలి నియోజకవర్గంలో రాజధాని కార్యాలయాలు వస్తాయని ప్రజా ప్రతినిధులే ప్రకటించడంతో ఆయా ప్రాంతాల్లో భూముల ధరకు రెక్కలు వచ్చాయి. అయితే రాజధాని వస్తుందా?, లేదా? అనే అనుమానంతో చాలామంది వేచి చూశారు. అమ్మకాలు లేకపోయినా భూముల రేట్లు మాత్రం పెరిగిపోయాయి. ఇప్పుడు రాజధాని ఇక్కడికి రాదని, అమరావతిలోనే ఉంటుందని స్పష్టమైపోయింది. ఈ నేపథ్యంలో భూముల ధరలు దిగి రావాలి. కానీ ఎవరూ తగ్గించడం లేదు. విశాఖలో భూములకు ఎప్పుడూ గిరాకీ ఉండడమే అందుకు కారణం.

గతంలో మాదిరిగా ఇంత శాతం పెంపు అని నిర్ణయించవద్దని రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రస్తుత ప్రభుత్వం సూచించింది. ముందుగా సంబంధిత శాఖలన్నీ కలిసి ఒక కమిటీగా ఏర్పడి 45 రోజుల పాటు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, అంతా కలిసి చర్చించుకొని ఏయే ప్రాంతాల్లో ఎంత మేరకు పెంచవచ్చునో నివేదించాలని సూచించింది. దీని ప్రకారం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంగళవారం తన ఛాంబర్‌లో రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లు, మండల తహసీల్దార్లు, వీఎంఆర్‌డీఏ అధికారులతో సమావేశమయ్యారు. ముందుగా అన్ని శాఖల నుంచి ఒక్కొక్కరు చొప్పున మండలానికి ఒక కమిటీ ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, అక్కడ భూముల రేట్లు...అన్నింటినీ పరిశీలించి డిమాండ్ మేరకు ఎక్కడ పెంచవచ్చునో చర్చించాలని, నివేదిక రూపొందించాలని ఆదేశించారు. పలు సమావేశాలు నిర్వహించి చర్చించుకున్నాక ప్రభుత్వానికి అంచనాలు పంపి ఆమోదం తీసుకోవాలని నిర్ణయించారు. ప్రతి మండలం నుంచి తహసీల్దార్, ఆ ప్రాంత సబ్ రిజిస్ట్రార్, వీఎంఆర్‌డీ నుంచి ఒకరు కమిటీలో ఉంటారు. వీరు వారం వారం షెడ్యూల్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తారు. అక్టోబరు నాటికి మార్కెట్ విలువలు సవరించేలా సిద్ధమవుతున్నారు.

2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యం



విశాఖ చేరుకున్న జ్యోతికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న క్రీడా సంఘాల ప్రతినిధులు - IIలో



కేజీహెచ్‌కు మరో 28 మంది చిన్నారులు

నర్సీపట్నం ఆస్పత్రి నుంచి తరలింపు

- మొత్తం 42 మందిలో ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న ఆరుగురు ప్రైవేటు ఆస్పత్రులకు తరలింపు - IIలో
- మిగిలిన వారికి కేజీహెచ్‌లో కొనసాగుతున్న వైద్య సేవలు

ముగ్గురు ఏసీపీల బదిలీ

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో ఏసీపీలుగా పనిచేస్తున్న ముగ్గురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈస్ట్ ఏసీపీగా పనిచేస్తున్న బీఎం జయరాం ప్రసాద్‌ను ఏలూరు డీఎస్పీగా బదిలీ చేసింది. సీసీఎస్ ఏసీపీగా అటాచ్‌మెంట్‌పై పనిచేస్తున్న టీఎస్ఆర్‌కే ప్రసాద్‌ను అమలాపురం డీఎస్పీగా, ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా బదిలీ చేసింది. బదిలీ అయిన వారి స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు.

నేటి ఏయూ పరీక్షలు వాయిదా

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం జరగాల్సిన పీజీ, డిగ్రీ పరీక్షలను భారత్ బంద్ కారణంగా వాయిదా వేసినట్టు ఏయూ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయిదా వేసిన పరీక్షను ఎప్పుడు నిర్వహించబోయేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

పిల్లలకు మెరుగైన వైద్య సేవలందించాలి

▸ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న వంశీకృష్ణ

మహారాణిపేట, ఆగస్టు 20: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు లోనైన చిన్నారులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సూచించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు పిల్లలు మృతి చెందిన విషయం తెలిసిందే. మరో 38 మంది పిల్లలు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ చిన్నారులను విశాఖ ఎంపీ శ్రీభరత్, అరకు ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, నాయకుడు గండిబాబ్జీ, బీజేపీ మహిళా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాతరాజ్, బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గుండు సీతారామ్, తదితరులు చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, వైద్యులు పాల్గొన్నారు.

సప్లయర్స్ రంగాన్ని చిన్నతరహా పరిశ్రమగా గుర్తించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సీతమ్మధార, ఆగస్టు 20: ప్రభుత్వం సప్లయర్స్ రంగాన్ని చిన్న తరహా పరిశ్రమగా గుర్తించాలని ది వైజాగ్ పటం ఫంక్షన్ మెటీరియల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్‌వీ సుబ్బారావు డిమాండ్ చేశారు. సీతమ్మధారలో ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో టెంట్ ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో సెప్టెంబరు 15న టెంట్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామన్నారు. చిరు వ్యాపారులనుంచి పెద్ద పెద్ద వ్యాపారులకు దీనిని ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. సంస్థ కార్యదర్శి బి.సాయిబాబా మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని సప్లయర్స్ ఆయా అసోసియేషన్ల కార్యవర్గ సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సీహెచ్ గిరిధర్, జి. శ్రీనివాస్, ఎస్.చిట్టిబాబు, ఎం.వి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో టీడీపీ నేత నజీర్ భేటీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న నజీర్

మహారాణిపేట, ఆగస్టు 20: కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌ను తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ మర్యాదపూర్వకం కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు అనంతరం జిల్లాని వివిధ సమస్యలను వివరించారు.



కళింగనగర్ రోడ్డులో రాకపోకలకు అడ్డంగా కొమ్మలు



నక్కవానిపాలెంలో రోడ్డుపై...

ఎక్కడి వ్యర్థాలు అక్కడే..

▸ విద్యుత్ నిర్వహణ పనుల కోసం చెట్ల నరికివేత
▸ రోడ్లపైనే కొమ్మలు వదిలేయంతో అవస్థలు

మాధవధార, ఆగస్టు 20; మురళీనగర్, మాధవధార ఎస్ఎస్‌టీఎల్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల కోసం చెట్ల కొమ్మలు నరికి ఎక్కడికక్కడే రోడ్డున పడేస్తున్నారు. కళింగనగర్, మాధవధార ఉడాకాలనీ, ఆర్టీఏ కార్యాలయం రోడ్డులో పలుచోట్ల ఈ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. కరెంటు సక్రమ సరఫరా, లైన్ల నిర్వహణ కోసం పేరిట ఈ ప్రాంతాల్లో హైటెన్షన్ తీగెలను ఆనుకుని పెరిగే చెట్లను సరఫరా నిలిపేసి నరికివేత పనులు తాత్కాలిక సిబ్బంది సాయంతో చేపడుతున్నారు. అయితే, పనులు పనులు పూర్తయిన తర్వాత అటు జీవీఎంసీ తమకు సంబంధం లేదని చెట్ల కొమ్మలు, వ్యర్థాలను అలాగే వదిలేస్తున్నారు. ఈపీడీసీఎల్ అధికారులు స్పందించడంలేదు. ఇలా రెండు శాఖల సమన్వయలోపంతో రోడ్లలో రాకపోకలు సాగించలేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నక్కవానిపాలెంలో..

సీతమ్మధార: గ్రేటర్ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెంలో విద్యుత్ తీగలకు అడ్డంకిగా ఉన్న చెట్టు కొమ్మలను ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించి రహదారిపై వదిలేశారు. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు రోజులు గడుస్తున్నా వీటిని తొల గించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూడాలని కోరుతున్నారు.

సమష్టిగా సమస్యలు పరిష్కరించుకోవాలి

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 20: దొండపర్తి రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కళ్యాణమండపంలో ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ (ఎబీఎస్ఎన్ఎల్‌పీడబ్ల్యూఏ) ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, పెన్షనర్లు సమష్టిగా తమ సమస్యలను సాధించుకోవాలని కోరారు. ఏపీ సర్కిల్ ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏబీఎస్ఎన్ఎల్ 2009 ఆగస్టు 20వ ప్రారంభించి పెన్షనర్లకు సంబంధించిన అనేక సమస్యలు పరిష్కరించినట్టు చెప్పారు. నాయకులు ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఏడో వేతన సంఘం సిఫార్సుల ప్రకారం బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల పెన్షన్ రివిజన్ జరగాలన్నారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు నిండిన పెన్షనర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎంఆర్ పట్నాయక్, జిల్లా కార్యదర్శి కె.సోమ సుందరరావు, కె.వి.డి. స్వామి, వి.ఆర్.కె.శర్మ, ప్రధాన సలహాదారు శ్రీమన్నారాయణ, కోశాధికారి పి.బాబూరావు, పెన్షనర్లు పాల్గొన్నారు.

మర్రిపాలెంలో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం



నూతన శాఖ ప్రారంభిస్తున్న నేవీ సీఎండీఈ అనూప్ జోయ్, కమాండర్

మర్రిపాలెం, ఆగస్టు 20: విశాఖపట్నం పరిధి మర్రిపాలెంలో బ్యాంక్ ఆఫ్ బరోడా 42వ శాఖ మంగళవారం ప్రారంభమైంది. ఇండియన్ నేవీ సీఎండీఈ అనూప్ జోయ్, కమాండర్ హరి ముఖ్య అతిథులుగా పాల్గొని లాంఛనంగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజనల్ హెడ్ పీఎం పదాన్ మాట్లాడుతూ.. ఖాతాదారులకు నమ్మకమైన సేవలను అందిస్తూ వారి మన్ననలు పొందుతున్నట్టు పేర్కొన్నారు. అలాగే, అభివృద్ధి పథం నడుస్తోందన్నారు. తమ బ్యాంక్ శాఖలను పలు ప్రాంతాలకు విస్తరిస్తున్నట్టు చెప్పారు. మర్రిపాలెం పరిసర ప్రజలు, ఖాతాదారులకు సేవలను మరింత సులభంగా పొందేందుకు వీలుగా ఇక్కడ బ్రాంచీని ప్రారంభించామన్నారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ సతీషా సాలుంకే, బ్రాంచ్ మేనేజర్ ఎం. మహేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రని కలిసిన గండి బాబ్జీ

మహారాణిపేట,ఆగస్టు 20: రాష్ట్ర గనులు,ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం నగరానికి విచ్చేసిన రవీంద్రకు పుష్ప గుచ్ఛమిచ్చి ఆయన స్వాగతం పలికారు.

బీసీలకు 20 శాతం

బార్లు, వైన్స్‌షాపులు కేటాయించాలి

డాబాగార్డెన్స్: బీసీలకు 20 శాతం వైన్స్ షాప్‌లు, బార్లు కేటాయించాలని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను రాష్ట్ర బీసీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రిని నగరంలోని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ పి. ప్రసాద్, ఆర్.కృష్ణగౌడ్, ఎం.రాంబాబు, వి.శ్యామ్‌సుందర్, బలరామ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రవీంద్రకు పుష్పగుచ్ఛమిస్తున్న బాబ్జీ



ఈవెంట్ అసోసియేషన్ సభ్యుల ర్యాలీ



ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

▸ జూనియర్ వైద్యురాలి హత్యాచారంపై నిరసనలు

మహారాణిపేట, ఆగస్టు 20: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ (ఈమా) విశాఖ చాప్టర్ డిమాండ్ చేసింది. నగరంలోని ఈవెంట్ మేనేజర్స్, కళాకారులు, యాంకర్లు, సింగర్లు తదితర విభాగాలకు చెందిన ప్రతినిధులతోపాటు రోటరీ క్లబ్ సభ్యులు బీచ్ రోడ్డులోనికాళీమాత ఆలయంనుంచి వైఎంసీఏ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయన్నారు.డ్రగ్ మాఫియా ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటం చేసినందునే కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై ఈ దారుణ సంఘటన జరిగిందని ఆరోపించారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సందీప్ కుమార్, షరీఫ్‌ఖాన్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుష హత్యను ఖండిస్తూ మంగళవారం సాయంత్రం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద ఎల్ఐసీ ఉద్యోగులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఇటువంటి దురాగతాలు పునరావృత కాకుండా చూడాలని, బాధితురాలి కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర బ్రాంచీలలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

పునరావృతం కారాదు: జనసేన

సీతంపేట: కోల్‌కతా ఆర్‌జీ కార్ ఆసుపత్రిలో పీజీ విద్యార్థిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు జనసేన పార్టీ డాక్టర్ సెల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బోడ్డేపల్లి రఘు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత కిరాతకంగా వైద్య విద్యార్థిని హత్యాచారం చేసినరోజును ఒక బ్లాక్ డేగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

మహారాణిపేట: జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనను న్యాయవాదుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జిల్లా కోర్టు ప్రాంగణంలోని మెయిన్ గేట్ వద్ద ఆందోళ నిర్వహించారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ కేసులో నిందితులకు ఉరిశిక్ష వేయాలని కోరారు. వైద్యులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన..

కంచరపాలెం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనపై కంచరపాలెం జోన్ ఐద్వా మహిళలు నిరసన వ్యక్తం చేశారు. జోన్ నాయకురాలు కె.అనురాధ, ఎం. జయలక్ష్మి ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల్లో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



కంచరపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ..

ఏటీఎంలలకు భద్రత నిల్

... 5వ పేజీ తరువాయి

కొన్నిచోట్ల ఉన్నప్పటికీ పర్యవేక్షించే సిబ్బంది లేకపోవడం వల్ల నేరం జరిగిన చాలాసేపటి వరకూ బ్యాంకు అధికారులు గుర్తించలేకపోతున్నారు. చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చేసరికే నిందితులు నగరం విడిచి వెళ్లిపోతున్నారు.

ఏటీఎంల భద్రతపై సీపీ దృష్టి

నగరంలో వరుసగా చోరీలు జరగడంతో ఏటీఎంల వద్ద భద్రతపై సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టిసారించారు. ఏటీఎం కేంద్రాలు కలిగివున్న బ్యాంకుల ప్రతినిధులతోపాటు ఏటీఎం యంత్రాలకు నగదు నింపే ఏజెన్సీలతో కూడా సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని బ్యాంక్‌ల ప్రతినిధులతోపాటు నగదు నింపే ఏజెన్సీలకు నోటీసులు పంపించేందుకు చర్యలు ప్రారంభించారు. ఏటీఎంల వద్ద విధిగా ప్రైవేటు సెక్యూరిటీ గార్డును నియమించడంతోపాటు సీసీ కెమెరాలు పనిచేసేలా చూడడం, వాటి ఫుటేజీని బ్యాంక్ కంట్రోల్‌రూమ్‌తోపాటు పోలీసులకు కూడా అందేలా చేయడం, ఏటీఎంల బయట కూడా రికార్డు అయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడం, కేంద్రాల వద్ద లైటింగ్ సదుపాయం ఉండేలా చూడడం, ఎవరైనా అనుమానితులు కనిపించినా, మోసం జరిగినా వెంటనే సంప్రతించేందుకు వీలుగా బ్యాంక్ అధికారులతోపాటు పోలీస్‌అధికారుల నంబర్‌లు అతికించడం వంటి వాటిపై సీపీ ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉందని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

హరియాణా ముఠా పనే...

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి, తగరపువలస ఏటీఎంను సీపీ శంఖబ్రతబాగ్చి స్వయంగా పరిశీలించారు. ఈ తరహా నేరాలు గతంలో జరిగినందున పాత నేరస్థుల వివరాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మునగపాక, పెందుర్తి, తగరపువలసల్లో ఒకే ముఠా చోరీకి పాల్పడినట్టు అంచనాకు వచ్చారు. ఐదుగురు వ్యక్తులు ఒక కారుతోపాటు బైక్‌పై వచ్చి మూడుచోట్ల చోరీ చేసి వెళ్లిపోయినట్టు పోలీసులు గుర్తించారని తెలిసింది. వీరంతా హరియాణాలోని నుహ్ జిల్లాకు చెందినవారని సమాచారం. వారిలో ఒకరు గతంలో నగరంలో ఇదే తరహా చోరీలు చేసినట్టు పోలీసులు నిర్ధారించినట్టు తెలిసింది. వరుసగా రెండు రోజులు చోరీలు చేయడం, తర్వాత కొంతకాలం ఆగి మళ్లీ ప్రారంభించడం... ఆ ముఠా ప్రత్యేకత అని, విశాఖ నగరంలోనే కాకుండా దేశవ్యాప్తంగా తిరుగుతూ ఈ తరహా దోపిడీలకు పాల్పడుతుంటుందని తెలిసింది. ఇదిలావుండగా చోరీ జరిగిన ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపాల్సిన తేదీ కంటే ఒకరోజు ముందుగానే నింపడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపే బాధ్యతను బ్యాంకులు కొన్ని ఏజెన్సీలకు అప్పగిస్తుంటాయి. అలాంటి ఏజెన్సీలో పనిచేసే సిబ్బంది ఎవరైనా దొంగల ముఠాతో సంబంధాలు కలిగివుండడం వల్ల ఒకరోజు ముందుగానే నగదు నింపారేమోనని కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. చోరీలకు పాల్పడిన ముఠా సభ్యులు ప్రస్తుతం హరియాణాలో ఉండడంతో అక్కడికి ప్రత్యేక బృందాలు వెళ్లినట్టు సమాచారం.

పడకేసిన పర్యాటకం

... 5వ పేజీ తరువాయి

నిర్వహించారు. ఆ తరువాత పూర్తిగా ఆపేశారు. వాస్తవానికి ఈ ఉత్సవాలకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తారు. వీటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

నేడు పర్యాటక మంత్రి రాక

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధికారులతో సాయంత్రం ఐదు గంటలకు వీఎంఆర్‌డీఏలో సమావేశం నిర్వహిస్తున్నారు. ఏడు గంటలకు ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ముచ్చటిస్తారు. రాత్రికి ఇక్కడే బస చేసి గురువారం మూడు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో పర్యాటక అంశాలపై సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి రాజమండ్రి బయలుదేరి వెళతారు.

25న స్టాండింగ్ కమిటీ సమావేశం?

... 5వ పేజీ తరువాయి

కొత్త స్టాండింగ్ కమిటీ ఎన్నిక కూడా పూర్తవ్వడంతో తొలి సమావేశం ఏర్పాటుచేయాలని కమిషనర్, మేయర్ భావించారు. అదే సమయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ వెలువడడంతో మరోమారు కోడ్ అమల్లోకి రావడంతో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహణకు బ్రేక్ పడింది. ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం కావడంతో ఈనెల 18న కోడ్ ముగిసింది. దీంతో స్టాండింగ్ కమిటీ సమావేశంపై మేయర్, కమిషనర్ దృష్టిసారించారు. గత ఐదు నెలలుగా కమిటీ సమావేశం జరగకపోవడంతో అజెండా తయారుచేసేందుకు అన్ని విభాగాల నుంచి ప్రతిపాదనలను ఆహ్వానించారు. ఇప్పటివరకూ 300కిపైగా అందినట్టు సమాచారం. వీటిలో 120 వరకూ మెకానికల్ విభాగానికి సంబంధించినవే ఉన్నట్టు తెలిసింది. కొత్త కమిటీ తొలి సమావేశం కావడంతో మేయర్‌తోపాటు కమిషనర్ కూడా సమావేశానికి హాజరుకావాల్సి ఉంటుంది. ఈనెల 25న స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని కమిషనర్ భావిస్తున్నట్టు స్టాండింగ్ కమిటీలోని కొందరు సభ్యులు పేర్కొంటున్నారు. ఇదిలావుండగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని కూడా వచ్చే నెల మొదటి వారంలో నిర్వహించాలని మేయర్, కమిషనర్ నిర్ణయించినట్టు తెలిసింది. కౌన్సిల్ సమావేశం చివరిసారిగా ఈ ఏడాది జనవరి ఏడో తేదీన జరిగింది. సాధారణ ఎన్నికల హడావిడి, రాష్ట్రంలో అధికారం మార్పిడి కారణంగా ఆ తరువాత కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. కనీసం మూడు నెలలకు ఒకసారి సమావేశం కావాల్సి ఉన్నప్పటికీ ఎనిమిది నెలలుగా జరగలేదు. దీంతో వీలైనంత త్వరలో కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని మేయర్, కమిషనర్ భావిస్తున్నారు. దీనికోసం ఎజెండా తయారుచేయాలని అధికారులను ఆదేశించగా ఇప్పటివరకూ 20 అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులకు అందినట్టు తెలిసింది. స్టాండింగ్ కమిటీ సమావేశం పూర్తయిన వెంటనే కౌన్సిల్ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. సుదీర్ఘకాలం స్టాండింగ్ కమిటీ సమావేశంతోపాటు కౌన్సిల్ సమావేశం కూడా జరగకపోవడం నగరాభివృద్ధిపై ప్రభావం చూపుతోందని అధికారులతోపాటు కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు.

బ్లాక్‌లో ఇసుక

... 5వ పేజీ తరువాయి

కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.నగరంలో మధురవాడ, పెందుర్తి, గాజువాక ప్రాంతాలకు చెందినవారు కూడా అగనంపూడి డిపోపై ఆధారపడుతున్నారు. చిరు వ్యాపారులు కూడా అగనంపూడి డిపో నుంచి టన్ను రూ.1076కు కొనుగోలు చేసి నగరంలో సుమారు రూ.రెండు వేల వరకు విక్రయిస్తున్నారు. రాజమండ్రి, శ్రీకాకుళంలో ర్యాంపుల వద్ద ప్రస్తుతం ఇసుక అమ్మకాలు లేకపోవడంతో ఒడిశా నుంచి తీసుకువచ్చే ఇసుకను కూడా టన్ను రూ.1,800కు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో దళారులు కొందరు అగనంపూడి డిపోలో టన్ను రూ.1,076కు కొనుగోలు చేసి నగరంలో రూ.రెండు వేలకు అటుఇటుగా అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ఆరు నెలల క్రితం కంటే టన్నుపై ఆరు వందల నుంచి ఏడు వందల రూపాయల వరకు అధికంగా చెల్లించాల్సి వస్తోందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. అగనంపూడి డిపోలో ఉన్న ఇసుక బహుశా మరో నెల వరకూ సరిపోతుందని, ఆ తరువాత ఒడిశా ఇసుకపైనే ఆధారపడాల్సి వస్తుందని...అప్పుడు రేటు మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇసుక కొరత ప్రభావం నగరంలో నిర్మాణాలపై పడుతుందంటున్నారు. కాగా అగనంపూడిలో ఇప్పటివరకు సుమారు 50 వేల టన్నుల అమ్మకాలు చేపట్టారు. మరో 40 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని గనుల శాఖ అంచనా వేసింది.

సీనియర్ ఫొటోగ్రాఫర్‌కు సత్కారం



విజయ్ దంపతులను సత్కరిస్తున్న ఫొటోగ్రాఫర్స్

డాబాగార్డెన్స్, ఆగస్టు 20: మీడియా రంగంలో ఫొటోగ్రాఫర్ విజయ్ తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందారని వక్తలు కొనియాడారు. ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విజయ్‌ను ఘనంగా సత్కరించారు. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో విజయ్ సేవలను పలువురు మననం చేశారు. ఆయన తీసిన ఫొటోలు సమాజాన్ని జాగృతం చేసేవిగా ఉంటాయన్నారు. తను తీసిన ఫొటోలతో అధికారులను మేల్కొలిపేలా చేశారన్నారు. పేదల వర్గాలకు ఆ యన తన సేవలతో చేరువయ్యారని పేర్కొన్నారు. సత్కార గ్రహీత విజయ్ తన అనుభవాలను వివరించారు.

శ్రీవైఖానస మండలి అధ్యక్షుడికి సన్మానం



సింగరాచార్య స్వామిని సత్కరిస్తున్న సభ్యులు

జగదాంబ కూడలి, ఆగస్టు 20: ఆగమనాల్లో శ్రీవైఖానస ఆగమనమని ఎంతో ప్రముఖమైందని ఉత్తరాంధ్ర వైఖానస మండలి గౌరవ అధ్యక్షుడు శ్రీమాన్ ఆర్. సింగరాచార్య స్వామి అన్నారు. మంగళవాం శ్రీకనకమహాలక్ష్మి దత్తత రామాలయంలో విఖనసమహాముని జయంతిని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆలయంలోని శ్రీవికనసమహాముని విగ్రహానికి అభిషేకం జరిపారు. ఉత్సవ మూర్తిని పల్లకిలో నిలిపి తిరువీధి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సింగరాచార్య స్వామిని సన్మానించారు. ఉత్తరాంధ్ర వైఖానస యూత్ ఫోరం అధ్యక్షుడు రంగనాథచార్యులు, ఆధ్యాత్మి కవేత్త రాజశేఖర్, గీతా ప్రచార సమితి ప్రతినిధి జగన్మోహనరావు, పి. శ్రీనివాస చక్రవర్తి, ఎం.రామకృష్ణచార్యులు, శ్రీధర్ పి.జగన్నాథచార్యులు, ఆలయ అర్చకులు, ఈవో శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

మురళీనగర్, ఆగస్టు 20; కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని అనాథా శ్రయంలో కలుషిత ఆహారంతిని అస్వస్థతతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ మూల.వెంకటరావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛంద సంస్థలు, వినోద కార్యక్రమాల నిర్వాహకులు మిగులు ఆహారాన్ని అనాథ శరణాలయాలకు అందించే పద్ధతి పూర్తిగా నిషేధించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఇలాంటి ఘనటలు పునరావృత్తం కాకుండా చూడాలని అన్నారు. బాలలతో ఆయన మాట్లాడిన వారి ఆరోగ్యపరిస్థితి తెలుసుకున్నారు.



గాజువాకలో రాజీవ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి

గాజువాక, ఆగస్టు 20: భారత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం పాత గాజువాక జంక్షన్‌లో నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల ఇంటక్ ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు ముఖ్యఅతిథిగా హాజరై రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ పేద ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, భూలోక, వర్మ, అప్పారావు, పెంటినాయుడు, అప్పారావు, తదితరలుఉ పాల్గొన్నారు.

పెందుర్తి: రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు విన్నకోట రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చినముషిడివాడలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి రాజీవ్ అందించిన సేవలను ఆయన వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎం.రామునాయుడు, ఆర్‌ఆర్ నాయుడు, వరప్రసాద్, పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

తుప్పలు తొలగించిన పోలీసులు

పెందుర్తి, ఆగస్టు 20: పెందుర్తిలో వరుస చోరీలు జరుగుతుండడంతో అగంతకులు తుప్పలు మాటున దాక్కొని చోరీలకు పాల్పడుతున్నారన్న సమాచారంతో మంగళవారం నేర విభాగ పోలీసు స్టేషన్ సిబ్బంది పలు ప్రాంతాల్లో తుప్పలు, డొంకలు, పొదలను తొలిగించారు, దట్టంగా ఉన్న పొదలు తీసివేసి ఆ ప్రాంతాలను చదును చేశారు. చోరీల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఇంటికి తాళం వేసి ఊరెళితే పోలీసులకు సమాచారాన్ని తెలపాలన్నారు.

సామూహిక సీమంతం

గోపాలపట్నం, ఆగస్టు 20: స్థానిక ఇందిరానగర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు గర్భిణులకు సామూహిక సీమంత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీవో ఎంపీఆర్ కుమారి గర్భిణులకు సీమంతాలు చేశారు. గర్భిణులు ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి, ప్రసవం తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నరవలో 'పొలంబడి'

పెందుర్తి, ఆగస్టు 20: మండలంలోని నరవలో మంగళవారం వ్యవసాయాధికారులు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ కాలంలో విత్తు నాటినప్పటి నుంచి పంట చేతికి వచ్చేవరకు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. వచ్చేనెల 20వ తేదీలోగా రైతులందరూ ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ అప్పలస్వామి, ఏడీఏ మాణిక్యమాంబ, వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు

కార్మికులకు రెయిన్ కోట్లు అందజేత

గాజువాక, ఆగస్టు 20: జీవీఎంసీ 79వ వార్డు పరిధి గంజిపేటలో పారిశుధ్య కార్మికులకు బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మంగళవారం రెయిన్ కోట్లను అందజేశారు. సంఘ సేవకుడు మడక రమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు తాము అండగా ఉంటామన్నారు. సేవా కార్యక్రమాలను రమేశ్‌నాయుడు మరింత విస్తృతం చేయాలన్నారు.

ర్యాలీ పోస్టర్లు ఆవిష్కరణ

అగనంపూడి, ఆగస్టు 20: కార్తీక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 25న యాంటీ డ్రగ్స్‌పై నిర్వహించనున్న అవగాహన ర్యాలీకి సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ర్యాలీ వివరాలను ట్రస్టు ప్రతినిధులు వెల్లడించారు. డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పాత గాజువాక కూడలిలో అవగాహన ర్యాలీని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభిస్తారన్నారు.

సినిమా గైడ్

- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** మెలోడి, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, కామేశ్వరి, మోహిని (గాజువాక)
- **సూపర్‌డీలక్స్ :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **బడ్డీ :** సౌజన్య (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** శారద, సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 27, వంకాయలు (తెలుపు) 45, వంకాయలు (నలుపు) 45, బెండకాయలు 20, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 30, దొండకాయలు 34, బంగాళదుంపలు 37, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 130, మునక్కాడలు (కిలో) 38, బరబాటి 25, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 40, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 42, కీరదోస 28, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

శ్రీనగర్‌లో సర్కారు స్థలం కబ్జా!

ఆక్రమణదారుడు వైసీపీ సానుభూతిపరుడు కావడంతో గడిచిన ఐదేళ్లలో అధికారులు చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున చర్యలకు ఉపక్రమించాలని స్థానికుల వేడుకోలు

గాజువాక, ఆగస్టు 20:

జాతీయ రహదారికి చేరువలో గాజువాకలోని శ్రీనగర్ నడిబొడ్డున ఎంతో విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. ఈ స్థలం కబ్జాపై రెవెన్యూ కార్యాలయాలకి ఫిర్యాదులు అందినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గాజువాక మండల పరిధి వడ్లపూడి రెవెన్యూ పరిధి సర్వే నంబర్-129లో సుమారు 600 గజాల ప్రభుత్వ స్థలాన్ని స్థానికంగా ఉంటున్న వైసీపీ సానుభూతిపరుడు



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణం



గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అంచెలంచెలుగా 70, 80 గజాల చొప్పున ఆక్రమించి.. పక్కా నిర్మాణాలు చేపట్టి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి విక్రయిస్తున్నారంటూ గతంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయటంతో సిబ్బంది వచ్చి పరిశీలించడంతో పాటు ఇది ప్రభుత్వ స్థలమని పేర్కొంటూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే బోర్డులు ఏర్పాటు చేసిన నెల రోజులకే వాటిని సదరు వ్యక్తి తొలగించి దర్జాగా స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టాడు.

వైసీపీ సానుభూతిపరుడు కావడం వల్లే గడిచిన ఐదేళ్లుగా ఎన్ని ఫిర్యాదులు చేసినా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున రెవెన్యూ యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి సర్కారు స్థలం కబ్జాపై పటిష్ఠ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉక్కు కర్మాగారానికి ప్రభుత్వాలు ఊపిరి పోయాలి

పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, ఆగస్టు 20: కొన ఊపిరితో ఉన్న స్టీల్‌ప్లాంటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊపిరి పోసి ఆదుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,285వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై సీఎం చంద్రబాబునాయుడు ఒత్తిడి తెచ్చి ఉక్కు కర్మాగార పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంటును నడిపితే 2030 నాటికి 300 మిలియన్ల టన్నుల సామర్థ్యానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్లాంటుకు ముడిసరకును పూర్తి స్థాయిలో అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. సెయిల్‌లో విలీనం చేస్తే స్టీల్‌ప్లాంట్ సమస్య శాశ్వతంగా పరిష్కారమవు తుందన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలే దేశానికి వెన్నెముక అని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎంతోమంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామన్న ప్రకటన వచ్చేంత వరకు తాపో పోరాటాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

వైభవంగా నర్సింగబిల్లమ్మ పండగ

గోపాలపట్నం, ఆగస్టు 20: ఇక్కడి వెంకటాపురంలో కొలువుదీరిన నర్సింగబిల్లమ్మ పండగను మంగళవారం శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వేయువజామున ప్రత్యేకంగా అలంకరించి పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించేందుకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు.

నాయుడుతోటలో..

వేపగుంట: నాయుడుతోట పరిసర ప్రాంతాల ప్రజల ఇలవేల్పు నర్సింగబిల్లి అమ్మవారి ప్రధాన పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, శాంతి హోమం చేశారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజు, మహేశ్, యశశ్వి, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోలమాబ ఉత్సవాలు

మల్కాపురం: ఇక్కడి ఎస్సీ కాలనీలో మూడు రోజులుగా రామ్-రాంజీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహిస్తున్న పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి పోలమాంబను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చేపట్టిన ఊరేగింపులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మల్కాపురం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



వెంకటాపురంలో పూజలందుకున్న నర్సింగబిల్లమ్మ

పీఎఫ్ కార్యాలయం వద్ద పింఛన్‌దారుల ధర్నా

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 20: సుప్రీంకోర్టు తీర్పు ఈపీఎఫ్-95 పింఛన్‌దారులకు హయ్యర్ పెన్షన్ ఇవ్వాలని ఇచ్చిన ఆదేశాలను సంబంధిత అధికారులు, కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజనల్ అధ్యక్షుడు బొడ్డేటి జగత్‌రావు డిమాండ్ చేశారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో ఉన్న పీఎఫ్ కార్యాలయం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిమం పింఛన్‌ను రూ.తొమ్మిది వేలకు పెంచాలన్నారు. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పు ప్రకారం పింఛన్ ఇవ్వాలని తాము ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు పీఎఫ్ కమిషనర్ విజయకుమార్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి ఎ.వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ పైడిరాజు, నాయకులు పి.శ్రీధర్, జగ్గారావు, బీఏ స్వామి, బీవీకే రాయ్, ఎంవీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



పీఎఫ్ కమిషనర్ విజయకుమార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

'ఉక్కు అడ్మిన్ భవనం ముట్టడి'ని విజయవంతం చేయాలి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 20: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22న చేపట్టనున్న ఉక్కు పరిపాలన భవనం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ నాయకులు కోరారు. ప్లాంటులోని వివిధ విభాగాల్లో మంగళవారం వారు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ప్లాంట్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఫలితంగా ప్లాంట్ భవిష్యత్తు ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ నెల 20వ తేదీ వచ్చినా జూలై నెలకు సంబంధించిన జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. దేశంలోని అన్ని స్టీల్‌ప్లాంట్‌ల్లో ఉద్యోగులు నూతన వేతనాలు తీసుకుంటుంటే ఇక్కడ మాత్రం పాత జీతాలకే దిక్కులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలన భవనం ముట్టడి కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాల్లో నాయకులు జె.అయోధ్యరాం, రామస్వామి, కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్లాంటులో నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

వైసీపీ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు

మల్కాపురం, ఆగస్టు 20: గ్రేటర్ 59వ వార్డు పరిధి ములగాడ హౌసింగ్ కాలనీలో వివాదాస్పద స్థలంలోకి వైసీపీ స్థానిక నాయకుడు పోతు కొండయ్య (రాజు) కొంతమందితో వెళ్లి గొడవ చేసారంటూ గాజువాక పోలీసులకు కడలి అరుణకుమారి అనే మహిళ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ స్థలానికి సంబంధించిన కేసు ప్రస్తుతం హైకోర్టులో ఉన్నప్పటికీ వినాయక చవితి ఉత్సవాలను చేస్తామంటూ సదరు స్థలంలోకి వారు వచ్చారని, అడ్డుకునేందుకు ప్రయత్నించగా తమతో గొడవకు దిగారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాఠశాల, ఎంఈవో భవన సమస్యలను 'పల్లా' దృష్టికి తీసుకువెళతా

కూర్మన్నపాలెం, ఆగస్టు 20: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని వడ్లపూడి పాఠశాల, ఎంఈవో కార్యాలయ భవనాన్ని కార్పొరేటర్ బొండా జగన్ పరిశీలించారు. పాఠశాల, డీఈవో భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నపాటి వర్షానికే నీరు లోపలకు చేరుతుందని ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మంగళవారం ఆయన వాటిని పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులను ఆయన పరిశీలించి ఉపాధ్యాయులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నందున ప్రజలందరూ ఈమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు.

రక్తహీనతపై బాలికల తల్లులకు అవగాహన

అగనంపూడి, ఆగస్టు 20: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్తహీనతపై బాలికల తల్లులకు ఎల్‌అండ్‌టీ కంపెనీ, సృజన స్రవంతి స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎల్‌అండ్‌టీ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు బాలికలు రక్తహీనత బారినపడకుండా తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాలికల ఆరోగ్యం తల్లుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన శానిటరీ నాప్కిన్ ఇన్సినేటర్ పరికరాన్ని పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ, కమిటీ విద్యా చైర్మన్ అట్టా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కృష్ణవేణి, రమాదేవి, ఆశాలత, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

95వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

పెందుర్తి-రూరల్, ఆగస్టు 20: జీవీఎంసీ 95వ వార్డు పరిధి కృష్ణరాయపురం, జ్యోతినగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ ముమ్మన దేముడు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జ్యోతినగర్ రహదారి సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. యూజీడీ పనుల కారణంగా రోడ్డు పనులకు అవరోధం కలుగుతుందని, ఈ పనులను త్వరగా పూర్తి చేసి రహదారి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. అలాగే కృష్ణరాయపురంలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానిక నాయకులు వేపాడ శ్రీను, డి.శ్రీను, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మలేరియా విభాగం, పారిశుధ్య సిబ్బంది

మలేరియాపై అవగాహన ర్యాలీ

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 20: మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహన కలిగివుండడంతో పాటు వాటి నివారణకు తగిన జాగ్రత్తలు పాటించవలసిందిగా జీవీఎంసీ గాజువాక జోన్ ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని 68వ వార్డు పరిధి రాజీవ్‌నగర్‌లో మలేరియా, పారిశుధ్య విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతు మలేరియా వంటి వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందేకన్నా అవి రాకుండా ముందస్తు జాగ్రత్తలను పాటించడం ఎంతో శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో అధికారులు డి.శ్రీనివాసరావు, కె.అప్పలరాజు, శ్రీనివాసరావు, సిబ్బందితో పాటు స్థానికులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో హిందీపై సెమినార్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డైరెక్టర్ పాండే

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 20: స్టీల్‌ప్లాంటులో అధికార భాష హిందీపై జాతీయ సెమినార్ మంగళవారం ప్రారంభమైంది. స్టీల్‌ప్లాంట్ టౌన్ అధికార భాష అమలు కమిటీ ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్‌తో కలిసి హిందీ పార్లమెంటరీ కమిటీ తాజా ప్రశ్నాపత్రం, త్రైమాసిక ప్రగతి అనే అంశంపై సెమినార్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండే మాట్లాడుతూ అధికార భాష అమలుకు ప్లాంటులో తీసుకుంటున్న చర్యలను వివరించారు. భాష అమలు కోసం పలు కార్యక్రమాలను చేపడుతున్నా మన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జీఎం (రాజభాష) లలన్‌కుమార్, ఏజీఎం టి.హైమావతి, నోడల్ అధికారి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 86వ వార్డులో నీటి సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం, ఆగస్టు 20: దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణలో భాగంగా కూర్మన్నపాలెం నుంచి వుడా నగర్‌కు వెళ్లే తాగునీటి సరఫరా మెయిన్ లైన్‌ను మరో చోటకు మార్చుతున్నందున బుధవారం 86వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని సంబంధిత విభాగం ఏఈ కేదారినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించి తమకు సహకరించవలసిందిగా కోరారు.

ఉక్కు ఉద్యోగికి ఏసీపీ అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 20: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఎం.సత్యనారాయణను వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి మంగళవారం అభినందించారు. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే చందనోత్సవం, సింహగిరి ప్రదర్శన, వైకుంఠ ఏకాదశి వంటి ఉత్సవాల్లో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి స్వచ్ఛందంగా సేవలందించినందుకు గాను సత్యనారాయణకు అభినందనలు తెలిపారు. ఈ సేవలను మరింత విస్తృతం చేయాలని ఏసీపీ ఆకాంక్షించారు.

పిల్లలకు మెరుగైన వైద్య సేవలందించాలి

» ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న వంశీకృష్ణ

మహారాణిపేట, ఆగస్టు 20: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు లోనైన చిన్నారులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సూచించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు పిల్లలు మృతి చెందిన విషయం తెలిసిందే. మరో 38 మంది పిల్లలు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ చిన్నారులను విశాఖ ఎంపీ శ్రీభరత్, అరకు ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, నాయకుడు గండిబాబ్జీ, బీజేపీ మహిళా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాతరాజ్, బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గుండు సీతారామ్, తదితరులు చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, వైద్యులు పాల్గొన్నారు.

సప్లయర్స్ రంగాన్ని చిన్నతరహా పరిశ్రమగా గుర్తించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సీతమ్మధార, ఆగస్టు 20: ప్రభుత్వం సప్లయర్స్ రంగాన్ని చిన్న తరహా పరిశ్రమగా గుర్తించాలని ది వైజాగ్ పటం ఫంక్షన్ మెటీరియల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్‌వీ సుబ్బారావు డిమాండ్ చేశారు. సీతమ్మధారలో ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో టెంట్ ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో సెప్టెంబరు 15న టెంట్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామన్నారు. చిరు వ్యాపారులనుంచి పెద్ద పెద్ద వ్యాపారులకు దీనిని ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. సంస్థ కార్యదర్శి బి.సాయిబాబా మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని సప్లయర్స్ ఆయా అసోసియేషన్ల కార్యవర్గ సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సీహెచ్ గిరిధర్, జి. శ్రీనివాస్, ఎస్.చిట్టిబాబు, ఎం.వి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో టీడీపీ నేత నజీర్ భేటీ

మహారాణిపేట, ఆగస్టు 20: కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌ను తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ మర్యాదపూర్వకం కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించారు అనంతరం జిల్లాని వివిధ సమస్యలను వివరించారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న నజీర్


కళింగనగర్ రోడ్డులో రాకపోకలకు అడ్డంగా కొమ్మలు


నక్కవానిపాలెంలో రోడ్డుపై...

ఎక్కడి వ్యర్థాలు అక్కడే..

» విద్యుత్ నిర్వహణ పనుల కోసం చెట్ల నరికివేత
» రోడ్లపైనే కొమ్మలు వదిలేయంతో అవస్థలు

మాధవధార, ఆగస్టు 20; మురళీనగర్, మాధవధార ఎస్ఎస్‌టీఎల్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల కోసం చెట్ల కొమ్మలు నరికి ఎక్కడికక్కడే రోడ్డున పడేస్తున్నారు. కళింగనగర్, మాధవధార ఉడాకాలనీ, ఆర్టీవో కార్యాలయం రోడ్డులో పలుచోట్ల ఈ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. కరెంటు సక్రమ సరఫరా, లైన్ల నిర్వహణ కోసం పేరిట ఈ ప్రాంతాల్లో హైటెన్షన్ తీగెలను ఆనుకుని పెరిగే చెట్లను సరఫరా నిలిపేసి నరికివేత పనులు తాత్కాలిక సిబ్బంది సాయంతో చేపడుతున్నారు. అయితే, పనులు పనులు పూర్తయిన తర్వాత అటు జీవీఎంసీ తమకు సంబంధం లేదని చెట్ల కొమ్మలు, వ్యర్థాలను అలాగే వదిలేస్తున్నారు. ఈపీడీసీఎల్ అధికారులు స్పందించడంలేదు. ఇలా రెండు శాఖల సమన్వయలోపంతో రోడ్లలో రాకపోకలు సాగించలేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నక్కవానిపాలెంలో..

సీతమ్మధార: గ్రేటర్ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెంలో విద్యుత్ తీగలకు అడ్డంకిగా ఉన్న చెట్టు కొమ్మలను ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించి రహదారిపై వదిలేశారు. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు రోజులు గడుస్తున్నా వీటిని తొలగించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా రాకపోకలకు ఇబ్బందిలేకుండా చూడాలని కోరుతున్నారు.

సమష్టిగా సమస్యలు పరిష్కరించుకోవాలి

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 20: దొండపర్తి రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కళ్యాణమండపంలో ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ (ఎఐబీఎస్ఎన్ఎల్‌పీడబ్ల్యూఏ) ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ, పెన్షనర్లు సమష్టిగా తమ సమస్యలను సాధించుకోవాలని కోరారు. ఏపీ సర్కిల్ ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏఐబీఎస్ఎన్ఎల్ 2009 ఆగస్టు 20వ ప్రారంభించి పెన్షనర్లకు సంబంధించిన అనేక సమస్యలు పరిష్కరించినట్టు చెప్పారు. నాయకులు ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఏడో వేతన సంఘం సిఫార్సుల ప్రకారం బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల పెన్షన్ రివిజన్ జరగాలన్నారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు నిండిన పెన్షనర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎంఆర్ పట్నాయక్, జిల్లా కార్యదర్శి కె.సోమ సుందరరావు, కె.వి.డి. స్వామి, వి.ఆర్.కె.శర్మ, ప్రధాన సలహాదారు శ్రీమన్నారాయణ, కోశాధికారి పి.బాబూరావు, పెన్షనర్లు పాల్గొన్నారు.

మర్రిపాలెంలో బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం

మర్రిపాలెం, ఆగస్టు 20: విశాఖపట్నం పరిధి మర్రిపాలెంలో బ్యాంక్ ఆఫ్ బరోడా 42వ శాఖ మంగళవారం ప్రారంభమైంది. ఇండియన్ నేవీ సీఎండీఈ అనూప్ జోయ్, కమాండర్ హరి ముఖ్య అతిథులుగా పాల్గొని లాంఛనంగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ రీజనల్ హెడ్ పీఎం పదాన్ మాట్లాడుతూ.. ఖాతాదారులకు నమ్మకమైన సేవలను అందిస్తూ వారి మన్ననలు పొందుతున్నట్టు పేర్కొన్నారు. అలాగే, అభివృద్ధి పథం నడుస్తోందన్నారు. తమ బ్యాంక్ శాఖలను పలు ప్రాంతాలకు విస్తరిస్తున్నట్టు చెప్పారు. మర్రిపాలెం పరిసర ప్రజలు, ఖాతాదారులకు సేవలను మరింత సులభంగా పొందేందుకు వీలుగా ఇక్కడ బ్రాంచీని ప్రారంభించామన్నారు. ఈకార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ సతీషా సాలుంకే, బ్రాంచ్ మేనేజర్ ఎం. మహేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


నూతన శాఖ ప్రారంభిస్తున్న నేవీ సీఎండీఈ అనూప్ జోయ్, కమాండర్

మంత్రి కొల్లు రవీంద్రని కలిసిన గండి బాబ్జీ

మహారాణిపేట,ఆగస్టు 20: రాష్ట్ర గనులు,ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం నగరానికి విచ్చేసిన రవీంద్రకు పుష్పగుచ్ఛమిచ్చి ఆయన స్వాగతం పలికారు.

బీసీలకు 20 శాతం బార్లు, వైన్స్‌షాపులు కేటాయించాలి

డాబాగార్డెన్స్: బీసీలకు 20 శాతం వైన్స్ షాప్‌లు, బార్లు కేటాయించాలని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను రాష్ట్ర బీసీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రిని నగరంలోని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ పి.ప్రసాద్, ఆర్.కృష్ణగౌడ్, ఎం.రాంబాబు, వి.శ్యామ్‌సుందర్, బలరామ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


రవీంద్రకు పుష్పగుచ్ఛమిస్తున్న బాబ్జీ



ఈ వెంట్ అసోసియేషన్ సభ్యుల ర్యాలీ



ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

» జూనియర్ వైద్యురాలి హత్యాచారంపై నిరసనలు

మహారాణిపేట, ఆగస్టు 20: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ వెంట్ మేనేజర్స్ అసోసియేషన్ (ఈమా) విశాఖ చాప్టర్ డిమాండ్ చేసింది. నగరంలోని ఈవెంట్ మేనేజర్స్, కళాకారులు, యాంకర్లు, సింగర్లు తదితర విభాగాలకు చెందిన ప్రతినిధులతోపాటు రోటరీ క్లబ్ సభ్యులు బీచ్ రోడ్డులోనికాళీమాత ఆలయంనుంచి వైఎంసీఏ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయన్నారు.డ్రగ్ మాఫియా ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటం చేసినందునే కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై ఈ దారుణ సంఘటన జరిగిందని ఆరోపించారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సందీప్ కుమార్, షరీఫ్‌ఖాన్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుష హత్యను ఖండిస్తూ మంగళవారం సాయంత్రం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద ఎల్ఐసీ ఉద్యోగులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఇటువంటి దురాగతాలు పునరావృత కాకుండా చూడాలని, బాధితురాలి కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర బ్రాంచీలలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

పునరావృతం కారాదు: జనసేన

సీతంపేట: కోల్‌కతా ఆర్‌జీ కార్ ఆసుపత్రిలో పీజీ విద్యార్థిని తీ వ్రంగా ఖండిస్తున్నట్టు జనసేన పార్టీ డాక్టర్ సెల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బోడ్డేపల్లి రఘు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత కిరాతకంగా వైద్య విద్యార్థిని హత్యాచారం చేసినరోజును ఒక బ్లాక్ డేగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

మహారాణిపేట: జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనను న్యాయవాదుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జిల్లా కోర్టు ప్రాంగణంలోని మెయిన్ గేట్ వద్ద ఆందోళ నిర్వహించారు. అనంతరం రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ కేసులో నిందితులకు ఉరిశిక్ష వేయాలని కోరారు. వైద్యులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన..

కంచరపాలెం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనపై కంచరపాలెం జోన్ ఐద్వా మహిళలు నిరసన వ్యక్తం చేశారు. జోన్ నాయకురాలు కె.అనురాధ, ఎం. జయలక్ష్మి ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల్లో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


కంచరపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ..

ఏటీఎంలకు భద్రత నిల్

... 5వ పేజీ తరువాయి

కొన్నిచోట్ల ఉన్నప్పటికీ పర్యవేక్షించే సిబ్బంది లేకపోవడం వల్ల నేరం జరిగిన చాలాసేపటి వరకూ బ్యాంకు అధికారులు గుర్తించలేకపోతున్నారు. చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చేసరికే నిందితులు నగరం విడిచి వెళ్లిపోతున్నారు.

ఏటీఎంల భద్రతపై సీపీ దృష్టి

నగరంలో వరుసగా చోరీలు జరగడంతో ఏటీఎంల వద్ద భద్రతపై సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టిసారించారు. ఏటీఎం కేంద్రాలు కలిగివున్న బ్యాంకుల ప్రతినిధులతో పాటు ఏటీఎం యంత్రాలకు నగదు నింపే ఏజెన్సీలతో కూడా సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని బ్యాంక్‌ల ప్రతినిధులతోపాటు నగదు నింపే ఏజెన్సీలకు నోటీసులు పంపించేందుకు చర్యలు ప్రారంభించారు. ఏటీఎంల వద్ద విధిగా ప్రైవేటు సెక్యూరిటీ గార్డును నియమించడంతోపాటు సీసీ కెమెరాలు పనిచేసేలా చూడడం, వాటి ఫుటేజీని బ్యాంక్ కంట్రోల్‌రూమ్‌తోపాటు పోలీసులకు కూడా అందేలా చేయడం, ఏటీఎంల బయట కూడా రికార్డు అయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటుచేయడం, కేంద్రాల వద్ద లైటింగ్ సదుపాయం ఉండేలా చూడడం, ఎవరైనా అనుమానితులు కనిపించినా, మోసం జరిగినా వెంటనే సంప్రతించేందుకు వీలుగా బ్యాంక్ అధికారులతోపాటు పోలీస్‌అధికారుల నంబర్‌లు అతికించడం వంటి వాటిపై సీపీ ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉందని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

హరియాణా ముఠా పనే...

... 5వ పేజీ తరువాయి

పెందుర్తి, తగరపువలస ఏటీఎంను సీపీ శంఖబ్రతబాగ్చి స్వయంగా పరిశీలించారు. ఈ తరహా నేరాలు గతంలో జరిగినందున పాత నేరస్థుల వివరాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మునగపాక, పెందుర్తి, తగరపువలసల్లో ఒకే ముఠా చోరీకి పాల్పడినట్టు అంచనాకు వచ్చారు. ఐదుగురు వ్యక్తులు ఒక కారుతోపాటు బైక్‌పై వచ్చి మూడుచోట్ల చోరీ చేసి వెళ్లిపోయినట్టు పోలీసులు గుర్తించారని తెలిసింది. వీరంతా హరియాణాలోని నుహ్ జిల్లాకు చెందినవారని సమాచారం. వారిలో ఒకరు గతంలో నగరంలో ఇదే తరహా చోరీలు చేసినట్టు పోలీసులు నిర్ధారించినట్టు తెలిసింది. వరుసగా రెండు రోజులు చోరీలు చేయడం, తర్వాత కొంతకాలం ఆగి మళ్లీ ప్రారంభించడం... ఆ ముఠా ప్రత్యేకత అని, విశాఖ నగరంలోనే కాకుండా దేశవ్యాప్తంగా తిరుగుతూ ఈ తరహా దోపిడీలకు పాల్పడుతుంటుందని తెలిసింది. ఇదిలావుండగా చోరీ జరిగిన ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపాల్సిన తేదీ కంటే ఒకరోజు ముందుగానే నింపడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపే బాధ్యతను బ్యాంకులు కొన్ని ఏజెన్సీలకు అప్పగిస్తుంటాయి. అలాంటి ఏజెన్సీలో పనిచేసే సిబ్బంది ఎవరైనా దొంగల ముఠాతో సంబంధాలు కలిగివుండడం వల్ల ఒకరోజు ముందుగానే నగదు నింపారేమోనని కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. చోరీలకు పాల్పడిన ముఠా సభ్యులు ప్రస్తుతం హరియాణాలో ఉండడంతో అక్కడికి ప్రత్యేక బృందాలు వెళ్లినట్టు సమాచారం.

పడకేసిన పర్యాటకం

... 5వ పేజీ తరువాయి

నిర్వహించారు. ఆ తరువాత పూర్తిగా ఆపేశారు. వాస్తవానికి ఈ ఉత్సవాలకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తారు. వీటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

నేడు పర్యాటక మంత్రి రాక

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధికారులతో సాయంత్రం ఐదు గంటలకు వీఎంఆర్‌డీఏలో సమావేశం నిర్వహిస్తున్నారు. ఏడు గంటలకు ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ముచ్చటిస్తారు. రాత్రికి ఇక్కడే బస చేసి గురువారం మూడు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో పర్యాటక అంశాలపై సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి రాజమండ్రి బయలుదేరి వెళతారు.

25న స్టాండింగ్ కమిటీ సమావేశం?

... 5వ పేజీ తరువాయి

కొత్త స్టాండింగ్ కమిటీ ఎన్నిక కూడా పూర్తవ్వడంతో తొలి సమావేశం ఏర్పాటుచేయాలని కమిషనర్, మేయర్ భావించారు. అదే సమయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ వెలువడడంతో మరోమారు కోడ్ అమల్లోకి రావడంతో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహణకు బ్రేక్ పడింది. ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం కావడంతో ఈనెల 18న కోడ్ ముగిసింది. దీంతో స్టాండింగ్ కమిటీ సమావేశంపై మేయర్, కమిషనర్ దృష్టిసారించారు. గత ఐదు నెలలుగా కమిటీ సమావేశం జరగకపోవడంతో అజెండా తయారుచేసేందుకు అన్ని విభాగాల నుంచి ప్రతిపాదనలను ఆహ్వానించారు. ఇప్పటివరకూ 300కిపైగా అందినట్టు సమాచారం. వీటిలో 120 వరకూ మెకానికల్ విభాగానికి సంబంధించినవే ఉన్నట్టు తెలిసింది. కొత్త కమిటీ తొలి సమావేశం కావడంతో మేయర్‌తోపాటు కమిషనర్ కూడా సమావేశానికి హాజరుకావాల్సి ఉంటుంది. ఈనెల 25న స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని కమిషనర్ భావిస్తున్నట్టు స్టాండింగ్ కమిటీలోని కొందరు సభ్యులు పేర్కొంటున్నారు. ఇదిలావుండగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని కూడా వచ్చే నెల మొదటి వారంలో నిర్వహించాలని మేయర్, కమిషనర్ నిర్ణయించినట్టు తెలిసింది. కౌన్సిల్ సమావేశం చివరిసారిగా ఈ ఏడాది జనవరి ఏడో తేదీన జరిగింది. సాధారణ ఎన్నికల హడావిడి, రాష్ట్రంలో అధికారం మార్పిడి కారణంగా ఆ తరువాత కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదు. కనీసం మూడు నెలలకు ఒకసారి సమావేశం కావాల్సి ఉన్నప్పటికీ ఎనిమిది నెలలుగా జరగలేదు. దీంతో వీలైనంత త్వరలో కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని మేయర్, కమిషనర్ భావిస్తున్నారు. దీనికోసం ఎజెండా తయారుచేయాలని అధికారులను ఆదేశించగా ఇప్పటివరకూ 20 అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులకు అందినట్టు తెలిసింది. స్టాండింగ్ కమిటీ సమావేశం పూర్తయిన వెంటనే కౌన్సిల్ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. సుదీర్ఘకాలం స్టాండింగ్ కమిటీ సమావేశంతోపాటు కౌన్సిల్ సమావేశం కూడా జరగకపోవడం నగరాభివృద్ధిపై ప్రభావం చూపుతోందని అధికారులతోపాటు కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు.

బ్లాక్‌లో ఇసుక

... 5వ పేజీ తరువాయి

కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.నగరంలో మధురవాడ, పెందుర్తి, గాజువాక ప్రాంతాలకు చెందినవారు కూడా అగనంపూడి డిపోపై ఆధారపడుతున్నారు. చిరు వ్యాపారులు కూడా అగనంపూడి డిపో నుంచి టన్ను రూ.1076కు కొనుగోలు చేసి నగరంలో సుమారు రూ.రెండు వేల వరకు విక్రయిస్తున్నారు. రాజమండ్రి, శ్రీకాకుళంలో ర్యాంపుల వద్ద ప్రస్తుతం ఇసుక అమ్మకాలు లేకపోవడంతో ఒడిశా నుంచి తీసుకువచ్చే ఇసుకను కూడా టన్ను రూ.1,800కు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో దళారులు కొందరు అగనంపూడి డిపోలో టన్ను రూ.1,076కు కొనుగోలు చేసి నగరంలో రూ.రెండు వేలకు అటుఇటుగా అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ఆరు నెలల క్రితం కంటే టన్నుపై ఆరు వందల నుంచి ఏడు వందల రూపాయల వరకు అధికంగా చెల్లించాల్సి వస్తోందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. అగనంపూడి డిపోలో ఉన్న ఇసుక బహుశా మరో నెల వరకూ సరిపోతుందని, ఆ తరువాత ఒడిశా ఇసుకపైనే ఆధారపడాల్సి వస్తుందని...అప్పుడు రేటు మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇసుక కొరత ప్రభావం నగరంలో నిర్మాణాలపై పడుతుందంటున్నారు. కాగా అగనంపూడిలో ఇప్పటివరకు సుమారు 50 వేల టన్నుల అమ్మకాలు చేపట్టారు. మరో 40 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని గనుల శాఖ అంచనా వేసింది.

సీనియర్ ఫొటోగ్రాఫర్‌కు సత్కారం


విజయ్ దంపతులను సత్కరిస్తున్న ఫొటోగ్రాఫర్స్

డాబాగార్డెన్స్, ఆగస్టు 20: మీడియా రంగంలో ఫొటోగ్రాఫర్ విజయ్ తన ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందారని వక్తలు కొనియాడారు. ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా మంగళవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విజయ్‌ను ఘనంగా సత్కరించారు. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో విజయ్ సేవలను పలువురు మననం చేశారు. ఆయన తీసిన ఫొటోలు సమాజాన్ని జాగృతం చేసేవిగా ఉంటాయన్నారు. తను తీసిన ఫొటోలతో అధికారులను మేల్కొలిపేలా చేశారన్నారు. పేదల వర్గాలకు ఆ యన తన సేవలతో చేరువయ్యారని పేర్కొన్నారు. సత్కార గ్రహీత విజయ్ తన అనుభవాలను వివరించారు.

శ్రీవైఖానస మండలి అధ్యక్షుడికి సన్మానం

జగదాంబ కూడలి, ఆగస్టు 20: ఆగమనాల్లో శ్రీవైఖానస ఆగమనమని ఎంతో ప్రముఖమైందని ఉత్తరాంధ్ర వైఖానస మండలి గౌరవ అధ్యక్షుడు శ్రీమాన్ ఆర్. సింగరాచార్య స్వామి అన్నారు. మంగళవాం శ్రీకనకమహాలక్ష్మి దత్తత రామాలయంలో విఖనసమహాముని జయంతిని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆలయంలోని శ్రీవిఖనసమహాముని విగ్రహానికి అభిషేకం జరిపారు. ఉత్సవ మూర్తిని పల్లకిలో నిలిపి తిరువీధి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సింగరాచార్య స్వామిని సన్మానించారు. ఉత్తరాంధ్ర వైఖానస యూత్ ఫోరం అధ్యక్షుడు రంగనాథచార్యులు, ఆధ్యాత్మి కవేత్త రాజశేఖర్, గీతా ప్రచార సమితి ప్రతినిధి జగన్మోహనరావు, పి. శ్రీనివాస చక్రవర్తి, ఎం.రామకృష్ణచార్యులు, శ్రీధర్ పి.జగన్నాథచార్యులు, ఆలయ అర్చకులు, ఈవో శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.


సింగరాచార్య స్వామిని సత్కరిస్తున్న సభ్యులు

బాధితులకు పరామర్శ

మురళీనగర్, ఆగస్టు 20; కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని అనాథా శ్రయంలో కలుషిత ఆహారంతిని అస్వస్థతతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ మూల.వెంకటరావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛంద సంస్థలు, వినోద కార్యక్రమాల నిర్వాహకులు మిగులు ఆహారాన్ని అనాథ శరణాలయాలకు అందించే పద్ధతి పూర్తిగా నిషేధించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఇలాంటి ఘనటలు పునరావృత్తం కాకుండా చూడాలని అన్నారు. బాలలతో ఆయన మాట్లాడిన వారి ఆరోగ్యపరిస్థితి తెలుసుకున్నారు.

నేత్రపర్వంగా అప్పన్న కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, ఆగస్టు 20: వరాహలక్ష్మీనృసింహ స్వామి నిత్యకల్యాణం నేత్రపర్వంగా సాగింది. మంగళ వారం వేకువజామున స్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై ఉంచి ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి నాదస్వరాలాపనలు, వేదమంత్రోచ్చారణల మధ్య జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణ చేసి అక్షితారోపణ కావించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దొంగల ముఠాపై అప్రమత్తం: ఎస్‌ఐ

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 20: నగర పరిధిలో అంతరాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తున్నట్టు సమాచారమున్నందున భీమిలి పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సూర్యనారాయణ హెచ్చరించారు. ఈ ముఠా తాళాలు వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసుకుని నేరాలు చేస్తుందన్నారు. గేటెడ్ కమ్యూనిటీ ఇళ్లను గమనించి వాటి తాళాలను తొలగించి చోరీలకు పాల్పడుతున్నట్టు చెప్పారు. అందువల్ల ఇళ్లల్లో విలువైన వస్తువులు ఉంటే, బయటకు వెళ్లే సమయంలో పోలీసు స్టేషన్లలో సమాచార మందించాలని కోరారు. వీలున్నంత వరకు బంగారు ఆభరణాలు, డబ్బు, ఇతర విలువైన వాటిని బ్యాంకు లాకర్లలో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలను అమర్చుకోవాలని కోరారు. నేర నియంత్రణకు సహకరించాలని కోరారు.

రహదారిపై ఒరిగిన విద్యుత్ స్తంభం


బీచ్‌రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్తంభం

రామ్‌నగర్ ఆగస్టు 20: ఓ విద్యుత్ స్తంభం ఇలా ప్రమాదకరంగా రహదారిపై పూర్తిగా ఒరిగిపోయింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు, వాహన చోదకులు భీతిల్లుతున్నారు. బీచ్‌రోడ్డు సమీపంలోని నోవాటెల్‌కు వెళ్లే రహదారిలో ఇలా స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది.

శిథిలావస్థలో శ్రీదేవి కాంప్లెక్స్



సింహాచలం, ఆగస్టు 20: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ఏడేళ్ల క్రితం కోట్లాది రూపాయలతో సింహాచలం కొండదిగువ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన నిర్మించిన శ్రీదేవి కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరింది. స్లాబ్‌నుంచి వర్షంనీరు లోనికి వస్తోంది. కొన్ని చోట్ల గోడలు బీటలు వారాయి. దీనికితోడు దిగువన దుకాణాల సముదాయం మధ్య ఏర్పాటు చేసి సులాబ్ కాంప్లెక్స్‌లోని మరుగుదొడ్లు చాలామేరకు దెబ్బతిన్నాయి. సెప్టిక్ ట్యాంక్‌నుంచి వ్యర్థాలు బయటకు రావడంతో పరిసరాల్లో దుర్వాసన వెలువడుతోంది. దాంతో వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. తక్షణం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు స్పందించి ఈ కాంప్లెక్స్ నిర్వాహణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

సినిమా గైడ్

- **తంగలాన్ :** శారద, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** కామేశ్వరి, మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), కన్య విశేష్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, సంగం, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం).
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)
- **భారతీయుడు-2 :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 27, వంకాయలు (తెలుపు) 45, వంకాయలు (నలుపు) 45, బెండకాయలు 20, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 26, క్యారెట్ 30, దొండకాయలు 34, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 130, బరబటి 25, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 40, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	98
ఫారం ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..


పర్యాటక ప్రాంతంగా ప్రకటించిన చిల్లపేట చెరువు


రహదారిగా తీర్చిదిద్దాల్సిన చెరువు గట్టు

చిల్లపేట చెరువు ఆధునికీకరణ కలేనా?

- రూ.1.98 కోటత్లో ప్రతిపాదనలు
- రూ.90 లక్షలతో అసంపూర్తి పనులు
- ఎమ్మెల్యే గంటాపైనే స్థానికుల ఆశలు

తగరపువలస, ఆగస్టు 20: గత పదేళ్లుగా పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోని చిల్లపేట చెరువుపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆశలు చిగురిస్తున్నాయి. భీమిలి- తగరపువలస మధ్య చిల్లపేట సమీపంలో ఉన్న ఈ చెరువు అభివృద్ధికోసం 2015లో రూపొందించిన ప్రతిపాదనలు ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లోని ట్యాంకుబండ్ తరహాలో దీనిని అభివృద్ధి చేయాలని భావించారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, పర్యాటకశాఖల భాగస్వామ్యంతో ఆధునికీకరించాలని నిర్ణయించారు. అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు 1.12.18న శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులకు గాను రూ1.98 కోట్లు విడుదల చేశారు. ఈ నిధుల్లో రూ.90 లక్షలు వెచ్చించి చెరువు తూర్పు భాగంలో గట్టును ఎత్తుచేసి దానిపై రహదారిని నిర్మించి వదిలేశారు. తాజాగా ఈ రహదారిలో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. చెరువులోనూ మొక్కలు పెరిగిపోయాయి. 16 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువును లోతు చేయించి బోటు


అభివృద్ధి పనులకు వేసిన శంకుస్థాపన ఫలకం

షికారు, చుట్టూ గట్టు నిర్మించి రహదారి, పార్కుల నిర్మాణం, చెరువు గట్టుపై నీటి పథకం ఏర్పాటు చేయాలని మాస్టర్ ప్లాన్ రూపొందించారు. పర్యాటక శాఖ, వీఎంఆర్‌డీఏ అధికారులు పలుమార్లు పర్యటించి పనులపై అంచనాలు వేశారు. కొన్ని పనులు చేపట్టారు. చిట్టివలస, తగరపువలస ప్రాంతాల నుంచి ఈ చెరువులోకి వచ్చే మురుగునీటి కాల్వలను మళ్లించారు. మంజూరైన నిధుల్లో రూ. 90 లక్షలు మాత్రం విడుదలయ్యాయి. ఈ నిధులు వ్యయం చేసే సమయానికి టీడీపీ అధికారం కోల్పోవడంతో ఈ ప్రతిపాదన అటకెక్కింది. ఇన్ని లక్షలు వెచ్చించినా సగం పనులు కూడా పూర్తికాలేదు. కేవలం తూర్పు భాగంలో 300 మీటర్ల మేర రోడ్డు నిర్మించి వదిలిపెట్టారు. తగరపువలస ప్రాంతీయులకు ఎంతో ఉపయోగకరమైన ఈ ప్రాజెక్టు అర్థాంతరంగా ఆగిపోవడంతో పలువురు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

మూలన పడేసిన వైసీపీ సర్కారు

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. స్థానికులు అనేక విన్నపాల తర్వాత చెరువును లోతు చేయించడానికి నిధులు విడుదల చేయించారు. కొంతవరకు చేసి పూడిక తీసి, ఆ మట్టికుప్పలను అలాగా వదిలేశారు. దీంతో చెరువు పనులన్నీ అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఈ చెరువు అభివృద్ధికి గతంలో ప్రయత్నం చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తిరిగి ఎన్నికవడంతో తాజా ప్రతిపాదనలు తయారుచేయాలని కోరుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే తగరపువలస భీమిలి మధ్య రహదారి పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించండి: ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

భీమునిపట్నం, ఆగస్టు 20: ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని భీమిలి ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ కోరారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం అఖిలపక్ష నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు అక్టోబరు 18 వరకు ఈసీ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి జాబితాలో నమోదైన ఓటర్లు ఉన్నారా లేదా తెలుసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారి వివరాలు సేకరించాలని, జాబితాలో ఫొటో సరిగా లేకుంటే కొత్తగా సేకరించడం, ఎపిక్ నంబరు ప్రకారం జాబితా సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలో 1500 మంది కంటే ఎక్కువమంది ఓటర్లు ఉంటే అదనపు పోలింగ్ స్టేషన్ అవసరాన్ని నమోదు చేయాలన్నారు. ఓటరు నేరుగా దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబరు 29 నుంచి నవంబరు 28 వరకూ అవకాశం ఉందన్నారు. నవంబరు 9,10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారన్నారు. టీడీపీ నేత గంటా నూకరాజు మాట్లాడుతూ ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్యను 1500 నుంచి వెయ్యికి తగ్గించాలన్నారు. వైసీపీ నేత అల్లిపిల్లి నరసింగరావు చనిపోయిన, వలస పోయిన వారి ఓట్లు తొలగించాలని సూచించారు. రెండుచోట్ల ఓటున్న వారికి ఎక్కడ అవసరమో తెలుసుకుని ఉంచాలని బీజేపీ నేత కంటుభుక్త సునీత కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సంజీవ్‌కుమార్, సూర్యప్రకాష్, విజయ, గోపాలరావు, ప్రసాద్, భీమిలి, పద్మనాభం తహసీల్దార్లు పి.రామారావు, ఆనంద్‌కుమార్, ఎన్నికల డీటీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మందుబాబుల హల్‌చల్


ధ్వంసమైన పరికరాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఆరిలోవ, ఆగస్టు 20: పెదగదలి ప్రాథమిక పాఠశాలలోనికి సోమవారం రాత్రి కొంత మంది మందుబాబులు ప్రవేశించి ఆవరణను చిందరవందర చేశారు. మద్యం, డ్రగ్స్ సేవించిన వారు మరుగుదొడ్ల తలుపులు, కొళాయిలు, వాష్ బేసిన్లు పగులగొట్టడంతో ప్రధానోపాధ్యాయుడు రవికాంత్ స్థానిక ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరు గోవింద దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే ఆరిలోవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి సమయంలో భద్రత కల్పించాలని గోవింద పోలీసులను కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ స్మార్ట్ మీటర్


అంగన్‌వాడీ కేంద్రానికి స్మార్ట్ మీటర్ బిగించిన విద్యుత్ అధికారులు, సిబ్బంది

ఆరిలోవ, ఆగస్టు 20: జోన్ 3 డివిజన్ విశాలాక్షినగర్ సెక్షన్‌లో మొదటి సారిగా ఎలక్ట్రికల్ స్మార్ట్ మీటర్ బిగించారు. అదానీ గ్రూపు వారితో కలిసి జోన్ 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాస్ వారి సిబ్బందితో పాటు ఈ స్మార్ట్ మీటర్ బిగించారు. విశాలాక్షినగర్ సెక్షన్ అంగన్‌వాడీ కేంద్రం సర్వీసు నంబరు వీఓ27/345530కు స్మార్ట్ మీటర్ అమర్చారు.

వైభవంగా కనకమ్మ అమ్మవారి జాతర


ఘటాలతో మహిళలు

వెంకోజీపాలెం, ఆగస్టు 20: పాతవెంకోజీపాలెంలోని కనకమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారు జామున మహిళలు బిందెలతో నీటిని తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ రాధాకృష్ణ యాదవ సేవా సంఘం, శ్రీ సీతారామ సేవా సంఘం, శ్రీ శెట్టి బలిజ సేవా సంఘం సభ్యులు తొలిపూజ చేశారు. మహిళలు, చీర, జాకెట్, గాజులు సమర్పించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, టీడీపీ నాయకులు అక్కరమాని వెంకటరమణ, 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, మొల్లి అప్పారావు, 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, డిప్యూటీ మాజీ మేయర్ మళ్ల అప్పలరాజు, కంచరాన అచ్చుతరావు పూజలు చేశారు. సాయంత్రం మంగళవాయిద్యాలు, బాణసంచా, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారిని ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 25న అన్నదానం, 27న మారువారం పండగ ఉంటాయని సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదారి పరదేశి, సీహెచ్. గోవింద్, నారు గోపి, ముగడ వాసు, పల్లా ఉమారాణి, మొల్లి శోభ, మళ్ల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం, ఆగస్టు 20: డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీలుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి తెలిపారు. గణితం-2, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం ఒక్కో పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. విశ్రాంత అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్లు, పీజీ, డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు ఈనెల 22 సాయంత్రం 5 గంటలలోగా కళాశాలలో తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.

బెటాలియన్‌కు గుర్తింపుతో ఆనందం


నగదు బహుమతిని సిబ్బందికి అందిస్తున్న కమాండెంట్ పద్మనాభరాజు

కొమ్మాది, ఆగస్టు 20: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన పరేడ్‌లో ఆర్మ్డ్ కంటిజెంట్ గా బెటాలియన్ మొదటి బహుమతి సాధించడం ఆనందంగా ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్ పద్మనాభరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మొదటి బహుమతిగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా అందుకున్న రూ.20వేలను సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు పి.దేవానందరావు, పి.సత్యం, వి.నారాయణ పాల్గొన్నారు.

చైల్డ్ అబ్యూస్‌పై అవగాహన సదస్సు


సదస్సులో పాల్గొన్న వక్తలు

విశాలాక్షినగర్, ఆగస్టు 20: స్టాప్ చైల్డ్ అబ్యూస్‌పై విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనిట్స్ గైనాకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సూర్యప్రభ, క్లినికల్ సైకాలజిస్ట్ పార్వతీ కాశ్యప్, గాయత్రీ కళాశాల డ్రగ్ అబ్యూస్ కౌన్సిలర్ డాక్టర్ సుభాష్, సర్వశిక్షాభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడారు. డ్రగ్స్‌తో దుష్ఫలితాలు, బాలల హక్కులు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం మాధురి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తీరం కోతకు గురవకుండా చెట్లు పెంచాలి

భీమునిపట్నం, ఆగస్టు 20: సముద్ర తీరం కోతకు గురవకుండా తీరం వెంబడి సరుగుడు మొక్కలను పెంచాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అభిప్రాయపడ్డారు. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సముద్ర తీర కోత నివారణ చర్యలపై గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ భీమిలి నోవాటెల్, బోయవీధి వద్ద తుఫాన్లు, కెరటాల ఉధృతి సమయంలో తీరం కోతకు గురవుతోందని, దీనిని నివారించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించాలన్నారు. ముఖ్యంగా తీరం వెంబడి వున్న కెమికల్ ఫ్యాక్టరీలతో సముద్రంలో మత్స్యసంపద ఘోరంగా దెబ్బతిని, తగ్గిపోయిందని, మత్స్యకారుల జీవనం అస్తవ్యస్తమైపోయిందన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. భీమిలిలో ఫిషింగ్ జెట్టీ నిర్మించాలని కోరారు. సంప్రదాయ మత్స్యకారుల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు కాసరపు నరసింగరావు మాట్లాడుతూ మత్స్యకారుల బతుకులకు భరోసా లేకుండా పోతోందని, తీరంలో సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపడుతున్న నిర్మాణాలను తక్షణం నిలిపివేయాలని కోరారు. టూరిజం డెవలప్‌మెంట్ అంటే మత్స్యకారులు పొట్ట చేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస పోవడం కాదన్నారు. మత్స్యకార నాయకుడు కొక్కిరి అప్పన్న మాట్లాడుతూ తీరం కోతకు గురవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మరో నేత కాసరపు నాగరాజు మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాల్లో సముద్రం సుమారు 100 నుంచి 125 మీటర్లు ముందుకు వచ్చిందని, మత్స్యకార గ్రామాల్లో భూ గర్భజలాలు ఉప్పునీటిగా మారిపోతున్నందున చర్యలు తీసుకోవాలని కోరారు. సముద్రతీరం కోతకు గురిగాకుండా తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని వీఎంఆర్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మధుసూదనరావు వివరించారు. సమావేశంలో తహసీల్దార్ పైలా రామారావు, ఎంపీడీవో జానకి, ఈవోపీఆర్డీ జి.అప్పలరాజు, వీఎంఆర్‌డీఏ డీఈ కార్తీక్, ఏఈఈ ప్రసాద్, ఏయూ ఓషనోగ్రఫీ పరిశోధకులు ప్రమీల, దివ్య పాల్గొన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ఇసుక సమస్య పరిష్కారానికి కృషి చేయండి

- ఎమ్మెల్యే గంటాకు క్వారీ లారీ ఓనర్స్ అసోసియేషన్ వినతి


ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 20: ఉత్తరాంధ్రలో ప్రస్తుతం నెలకొన్న ఇసుక సమస్యనుప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబును కోరింది. ఈ మేరకు వినతి పత్రాలను అందించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మద్దిల వెంకటరమణ, కార్యదర్శి రమణ, కోశాధికారి మాధవరావు మాట్లాడుతూ, ప్రస్తుతం ఇసుక సమస్యతో వినియోగదారులపై ఆర్థికభారం పడటంతోపాటు లారీల యజమానులు, ఈ రంగంపై ఆధారపడిన సుమారు 30 వేల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. గత రెండు నెలలుగా శ్రీకాకుళం జిల్లాలో ఇసుక రీచ్‌లు మూసివేయడంతో ఆర్థికంగా నష్టపోయినట్లు పేర్కొన్నారు. లారీ ఫైనాన్స్‌లు, ఇన్సూరెన్స్‌లు, సిబ్బంది జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో తలెత్తిన ఇబ్బందులు తిరిగి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక రీచ్‌ల వద్ద టన్నుకి రేటు నిర్ణయించి, దాని ప్రకారం విక్రయించాలని కోరారు. విశాఖలో అగనంపూడి వద్ద ఒకే డిపోతో సరఫరా ఉందని, దీనినుంచి ఒక లారీకి ఇసుక కావాలంటే మూడు నుంచి నాలుగు రోజులు ఎదురుచూడాల్సి వస్తోందని పేర్కొన్నారు. అలాగే గతంతో పోల్చితే ఇసుక ధర కూడా పెరిగిందన్నారు. ఈస్థితిలో సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేలను వారు అభ్యర్థించారు.

ప్రజాభిప్రాయ సేకరణ నిలిపివేయాలని వినతి

ఆనందపురం, ఆగస్టు 20: మండలంలోని కుసులవాడ సర్వేనంబరు 104లో ఎద్దుమెట్టలో గ్రావెల్, రఫ్‌స్టోన్, క్వార్ట్జ్ మైనింగ్ అనుమతులకోసం నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలని కోరుతూ కలెక్టర్‌కు ఈ మెయిల్‌లో వినతిపత్రం పంపామని సీపీఐ కార్యదర్శి మురుపిల్లి పైడిరాజు తెలిపారు. యంత్రాలతో మైనింగ్ చేసి, భారీ వాహనాలతో తరలించనున్న నేపథ్యంలో గొట్టుపల్లి, పందలపాక, తర్లువాడ, ముకుందపురం, రేగివానిపాలెం, చిన్నపాలెం, రాణిపేట, బోణి, చందక, చిన్నాపురం, జగ్గరాజుపాలెం, సీతంపేట, ఏనుగులపాలెం, తర్లువాడ గ్రామాలు కాలుష్యంతో నిండిపోతాయన్నారు. ఈ ప్రతిపాదన విరమించాలని కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ఆనందపురం, ఆగస్టు 20: గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి పి.అనిల్ రైతులకు సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మంగళవారం 340 పశువులకు ఉచితంగా టీకాలు వేశారు.

'వార్డు సర్వతోముఖాభివృద్ధికి కృషి'


కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సింహాచలం, ఆగస్టు 20: మహావిశాఖ 98వ వార్డు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ పీవీ నరసింహం అన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యునిగా ఎన్నికైన సదర్భంగా వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళ వారం రాత్రి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వార్డు ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తానన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు రాజనాల సత్యారావు, మేకా కాసుగోపాల్, శీర కృష్ణ, పట్నాల ధర్మరాజు, సిరిపురపు సురేష్, గండ్రెడ్డి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కండ్ల కలకపై జాగ్రత్తగా ఉండాలి

ఆరిలోవ, ఆగస్టు 20: కండ్ల కలక వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యురాలు హిమబిందు తెలిపారు. కండ్ల కలకను శాస్త్రీయంగా పింక్ ఐ అని (గులాబీ కన్ను) అని పిలుస్తారన్నారు. ఈ వ్యాధి వైరస్ , బాక్టీరియా, అలర్జీలతో వస్తుందన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత రెండు వారాల్లో నయమవుతుందని, అయితే, వైద్యులు సలహాలను పాటించాలని సూచించారు. బాక్టీరియాతో వచ్చే కండ్ల కలక యాంటీ బయోటిక్ చుక్కల మందుతో నివారించవచ్చన్నారు. అలర్జీతో వస్తే యాంటీ హిస్టామైన్ మందుతో తగ్గుతుందని తెలిపారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

భీమునిపట్నం, ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దార్శనికుడని కాంగ్రెస్ ఇన్‌చార్జి అద్దాల వెంకటవర్మ రాజు అన్నారు. రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో సాంకేతిరంగం విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీయేనని అన్నారు. ఈ కార్యక్రమంలో గాదం మహేష్, పడాల రమణ, పొట్టి రజనీకాంత్, కాటా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

98వ వార్డులో పందుల స్వైరవిహారం

సింహాచలం, ఆగస్టు 20: గ్రేటర్ 98వ వార్డులో పలుప్రాంతాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో పలు రకాల వ్యాధులు ప్రబలుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ప్రియాగార్డెన్స్, శిడగం వీధి, టీవీ టవర్ కాలనీ, సాయినగర్ తదితర శివారు ప్రాంతాల్లో పందులు గుంపులుగా తిరుగుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి పర్యటించిన సమయంలో టీవీ టవర్ కాలనీ వాసులు ఈ సమస్య వివరించినా పరిష్కారానికి నోచుకోలేదు. ఇకనైనా పందుల నియంత్రణకు జీవీఎంసీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.